

శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం

కదిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవార్లతో శ్రీవారి కల్యాణం కనులపండువగా చేశారు. అనంతరం శ్రీవారికి కల్యాణ కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ధనుర్మాస పూజలు

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 4.30 గంటలకే పూజలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. జనవరి 15వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ఆదర్శం.. పొట్టి శ్రీరాములు జీవితం: జేసీ



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శమని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ.. సమాజంలో సమానత్వం, సమగ్రాభివృద్ధి కోసం పొట్టి శ్రీరాములు చూపిన మార్గాలు చిరస్మరణీయంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

పోలీసుల నిత్య జీవితంలో క్రీడలు ఓ భాగం : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసుల నిత్య జీవితంలో క్రీడలు ఓ భాగమని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక శిరసాని పరేడ్ మైదానంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోలీసు క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఎస్పీ హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతో అవసరమన్నారు. క్రీడాస్ఫూర్తితో విధి నిర్వహణలో వ్యవహరించాలని సూచించారు. అంతకు మునుపు క్రికెట్ ఫైనల్‌కు చేరిన జట్లను ఉత్తేజపరచడానికి ఎస్పీ బ్యాట్ పట్టారు. తరువాత క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో హిందూపురం సబ్‌డివిజన్, ఏఆర్ అర్మ్ రిజర్వ్‌డ్ జట్లు తలపడ్డాయి. హిందూపురం సబ్ డివిజన్ జట్టు తొలుత 15ఓవర్లలో 105 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏఆర్ అర్మ్‌రిజర్వ్‌డ్ జట్టు 11 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, విజేతగా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ఎస్పీ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి, హిందూపురం డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



క్రికెట్ బ్యాట్ పట్టిన ఎస్పీ రత్న

పారిశ్రామికోత్సాహం..

కూటమి 4.0 పాలసీతో వెలుగులు

- టేకులోడు వద్ద 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్
- నేడు మంత్రి కొండపల్లి రాక
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో పురోగతిపై సమీక్ష





పుట్టపర్తి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇటీవల అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కులపై ప్రజెంటేషన్‌లో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న విషయం స్పష్టమైంది. గత ఐదేళ్లు వైసీపీ పాలకులు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. ఒక్క పరిశ్రమ కూడా తీసురాలేకపోయారు. దీంతో పారిశ్రామిక రంగం డీలా పడింది. ఈలోటును శరవేగంగా పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. అధికారం చేపట్టిన అర్నెల్లలోనే జిల్లా అంతటా అభివృద్ధి విస్తరించేందుకు కసరత్తు చేస్తోంది. చిలమత్తూరులో పారిశ్రామి క్లస్టర్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో ఎన్టీఆర్ హయాంలో తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడకు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ హయాంలో పెనుకొండలో అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ, అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన బెల్, నాసెన్ ఏర్పాటుతో జిల్లా వైపు ఔత్సాహికుల చూపు మళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి అర్నెల్లలోనే జిల్లాలో వెనుబడిన ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఏపీఐఐసీ భూములు కేటాయించింది. ఈభూముల్లో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగులు, మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. మొదటి దశలో రూ.1430 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కల్లుమర్రి గ్రామ పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో మంత్రి నారా లోకేశ్ ఇటీవల పర్యటన సందర్భంగా విద్యుత్ వాహనాల (ఈవీల) బ్యాటరీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమ అనంత జిల్లాలో పెట్టాలని దిగ్గజ సంస్థ టెస్లాను కోరారు. అందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసిందన్న ప్రచారం నేపథ్యంలో జిల్లావాసుల్లో ఆశలు రేగాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా పారిశ్రామికాభివృద్ధికి అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది.

కూటమితో పారిశ్రామిక వెలుగులు

చిలమత్తూరులో పారిశ్రామిక క్లస్టర్

కర్ణాటక సరిహద్దు చిలమత్తూరు వద్ద పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నారు. జూలైలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేందుకు చిలమత్తూరులో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. టేకులోడు వద్ద ఇప్పటికే 225 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీ సిద్ధం చేస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో తాగునీటి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. ఇక్కడే మరో 880 ఎకరాల భూములను ఏపీఐఐసీ గుర్తించింది. తాజాగా టేకులోడులో పారిశ్రామి క్లస్టర్ ఏర్పాటు చేసే దిశగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపుతున్నారు. చిలమత్తూరుకు హంద్రీనీవా ద్వారా నీరు అందించేందుకు దేమకేతపల్లి వద్ద మడకశిర ఉపకాలువపై ఎత్తిపోతల పథకం నిర్మించాలని నిర్ణయించారు. అందుకు రూ.550 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేయగా.. ఆర్థిక శాఖ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. 2006లో చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో పరిశ్రమల నిర్మాణానికి లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు 8840 ఎకరాలను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టబెట్టింది. ఆ భూములు న్యాయ వివాదాల్లో చిక్కుకున్నాయి. ఆ చిక్కుముడులు విప్పి, ఆ భూముల్లో ఐటీ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

నేడు మంత్రి సమీక్ష

రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. చిలమత్తూరు మండలం టేకులోడు ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కును సందర్శించి, అనువైన భూములను పరిశీలిస్తారు. అనంతరం పెనుకొండలో జిల్లాలోని ఎంఎస్ఎంఈ పార్కులపై జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంతోపాటు పారిశ్రామిక వేత్తలు, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. జిల్లాలో ఇప్పటికే సేకరించిన భూములు, ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో కొత్తగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపై సమీక్ష చేయనున్నారు.

నూతన పాలసీతో..

పెట్టుబడులు.. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహించి, వివిధ రంగాల్లో ఉపాధిని కల్పించే దిశగా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకొచ్చింది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించనున్నారు. ఇప్పటికే సేకరించిన పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లాట్లు తీసుకుని, కొందరు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ఎయిర్ బస్, వీరా ఎలక్ట్రికల్ బస్సుల తయారీ సంస్థలు సైతం వందలాది ఎకరాల భూములు తీసుకుని, పరిశ్రమలు పెట్టలేదు. ఇలాంటి వాటిపై ఏపీఐఐసీ చర్యలు ప్రారంభించింది. నిబంధనల మేరకు పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందేనని ఏపీఐఐసీ అధికారులు తెగేసిచెబుతున్నారు. గడువులోగా ఏర్పాటు చేయని పారిశ్రామికవేత్తలు భూములు వెనక్కివ్వాలని నోటీసులు జారీ చేస్తున్నారు.





సత్యసాయి పాదుకపూజలో పాల్గొన్న కృష్ణా జిల్లా భక్తులు

అలరించిన నృత్యరూపకం



పేదలకు టూల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్.. నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

పుట్టపర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా బాలవికాస్ చిన్నారులు స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం రాత్రి భారత మాత ఆరాధకులు, త్యాగధనులు పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను కట్టిపడేసింది. కృష్ణా జిల్లా భక్తులు రెండోరోజు ఆదివారం సత్యసాయి పాదుక అష్టోత్తర నామార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ జిల్లా సేవాదళ్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు కుట్టుమిషన్లు, టూల్ కిట్లను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పంపిణీ చేశారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యరూపకంతో అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.







కులగణన అవసరం

దీంతోనే సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు.. సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు (7లో...)

బ్రహ్మరథంపై నారసింహుడు

- భక్తరహళ్ళిలో వైభవంగా ఉత్సవం



స్వామివారి రథోత్సవం, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



మడకశిర రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోవిందనామ స్మరణతో మండలంలోని భక్తరహళ్ళి గ్రామం మార్మోగింది. భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లేడగుంటలో స్వామి వారి బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో హోమాలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గోవిందనామస్మరణతో అర్చకులు... స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి, విశేష పూజలు చేశారు. అనంతరం రథాన్ని భక్తులు లాగారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. మొక్కుబడులు ఉన్న భక్తులు.. స్వామివారి రథంపై అరటి పండ్లు, వేరుశనగ కాయలు వేసి, వాటిని తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల్లోకి వెళ్లి పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆంధ్ర, కర్ణాటక నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, ఈఓ నరసంహ రాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు భూతప్పల ఉత్సవం

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టం భూతప్పల ఉత్సవం సోమవారం నిర్వహించనున్నారు. జ్యోతుల ఉత్సవం కూడా ఉంటుంది. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటకు నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

250 మందితో బందోబస్తు

భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాలకు ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 230 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

25 ఆర్టీసీ బస్సు సర్వీసులు

భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాలకు 25 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ మడకశిర డిపో మేనేజర్ రామసుబ్బయ్య తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోగస్‌కు చెక్..?

అనర్హుల పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధం.. క్షేత్రస్థాయిలో పూర్తయిన సర్వే



ఆమిదాలగొంది గ్రామంలో పింఛన్ల సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. అనర్హులకు గుర్తించే సర్వే పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకో సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 9, 10 తేదీల్లో ఆయా సచివాలయాల పరిధిలో బృందాలుగా ఏర్పడి, ఏకకాలంలో సర్వే నిర్వహించారు. గత వైసీపీ హయాంలో అనర్హులకు ఇష్టానుసారంగా పింఛన్లు మంజూరు చేశారు. వాటిని ఏరివేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మడకశిర మండలం ఆమిదాలగొందిలో పింఛన్ సర్వే నిర్వహించారు. నివేదికను పరిశీలించి, గ్రామసభ నిర్వహించి సర్వేలో వెల్లడైన బోగస్ పింఛన్ల వివరాలను తెలియజేసి, అందరి ఆమోదంతో వాటిని రద్దు చేయాలని భావిస్తోంది.

అర్హులకు దక్కనందుకే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు.. అధికారులపై ఒత్తిడి చేసి అనర్హులకు పింఛన్లు మంజూరు చేయించారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారుల పేరుతో ఎక్కువగా బోగస్ పింఛన్లు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అదే సమయంలో రాజకీయ కారణాల వల్ల పింఛన్లు పొందని అర్హులు కూడా భారీ సంఖ్యలో ఉన్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో బోగస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది.

బయటపడనున్న అక్రమాలు

ఆధార్ కార్డులో వయసు పెంచి వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వారు, వైద్యులను మేనేజ్ చేసి, సదరం సర్టిఫికెట్లు తీసుకున్న వారు, భర్త ఉన్నా.. ఒంటరి మహిళ ధ్రువపత్రాలు పొందిన వారు, కళలు అంటేనే తెలియని డప్పు, వాయిద్య కళాకారులపై సర్వే అధికారులు దృష్టి సారించనున్నారు. సదరు సచివాలయం పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన అర్హుల వివరాలను కూడా పనిలో పనిగా సేకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తారు. ప్రభుత్వ నిర్ణయం బోగస్ లబ్ధిదారుల్లో వణుకు పుట్టిస్తుండగా.. అర్హుల్లో మాత్రం ఆనందం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా సమగ్ర సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమిదాలగొంది గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేశాం. మొత్తం 482 పింఛన్లపై రెండురోజులపాటు సమగ్ర సర్వే నిర్వహించాం. పారదర్శకత కోసం పొరుగు మండలానికి చెందిన అధికారులు, ఉద్యోగుతో సర్వే చేయించాం.

- నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

విజేత జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు (వివరాలు 7లో..)

కులగణన అవసరం

దీంతోనే సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు.. సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావాలంటే కులగణన అవసరమని సామాజిక విశ్లేషకుడు, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో తొలుత 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎన్ సాహు ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్నవారే అన్నారు. కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందన్నారు. కేరళలో మొట్టమొదటిసారి నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక కులగణన సర్వే చేయించారని గుర్తు చేశారు. ఆ సర్వేలో అన్ని మతాల్లోనూ వివక్ష ఉందని స్పష్టమయిందని తెలిపారు. అంబేద్కర్ వ్యాఖ్యానించినట్లు దేశంలో ఉన్న నిచ్చెనమెట్ల వ్యవస్థలో పైకి పోయేకొద్దీ వివక్ష తగ్గుతుందని, దిగువకొచ్చేసరికి అంత పెరుగుతుందని స్పష్టం చేశారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టు మాలిని సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... బస్తరులో హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి అడవుల్లోని విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తీవ్రవాద ముద్రవేసి అమాయక ఆదివాసీలపై భద్రతా బలగాలద్వారా



మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. మందుపాతర పెట్టారన్న నెపంతో ఒక గ్రామంలో 127 మంది ఆదివాసీలను ఎన్ఐఏ అరెస్టు చేసి ఐదేళ్లు జైల్లో పెట్టిందని తెలిపారు. ఆ తర్వాత వారంతా నిర్దోషులుగా బయట పడ్డారని, అంతలోపు ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయని విచారం వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందన్నారు. పాఠ్యాంశాలను మార్చి కాషాయీకరణ చేసే చర్యలు అందులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి రాజేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డాక్టర్ ప్రసూన, ఎస్ఎం బాషా, రసూల్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

అనంతపురం అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వతేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఎంపీ ఆఫీస్‌లో ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా జాబ్ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అన్ని ట్రేడ్స్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అప్రెంటిషిప్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు చిత్తూరు, తిరుపతిలోని అమరరాజా బ్యాటరీస్ సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 30 సంవత్సరాల వరకు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో రూ.12,500 నుంచి రూ.13,600 వరకు ఇవ్వడంతోపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేలు వేతనం ఇస్తారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు 9000024919, 9000433990 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

రూరల్ క్రికెట్ లీగ్‌లో పరుగుల వర్షం


హుసనారా


చైత్ర


హాన్సిరెడ్డి


హిమవర్షిణి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారిణులు పరుగుల వర్షం కురిపిస్తున్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా... 30 ఓవర్లలో ఏఎస్ఏ 4వికెట్లు మాత్రమే కోల్పోయి 312 పరుగులు చేసింది. ఇందులో హాన్సిరెడ్డి 116, చైత్ర 114 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన టీసీఏ 30 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసి ఓటమి పాలైంది. హిమవర్షిణి (153) ఒంటరి పోరాటం వృథా అయ్యింది. మరో మ్యాచ్‌లో కదిరి, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడగా... కదిరి నిర్ణీత 30ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. బ్యాటర్లు షేక్ హుసనారా 114, చైత్రరెడ్డి 70 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్ఎస్‌బీఎన్ 29.4 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కదిరి 93 పరుగుల తేడాతో విజయం నమోదు చేసింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడగా...టీసీఏ 40 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 239 పరుగులు చేసింది. కౌశిక్ 69, నయీం 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్ఎస్‌బీఎన్ 39.3 ఓవర్లలో 126 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో ఏసీఏ 113 పరుగుల తేడాతో గెలుపొందింది. పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి పర్యవేక్షించారు.

రగ్బీ జట్ల ఎంపిక


ఎంపికైన రగ్బీ బాలబాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ అండర్-15 బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాస్థాయి రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం బత్తలపల్లిలో ఉన్న ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, టోర్నీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఎంపికైన బాలికల జట్టులో...గీతారెడ్డి, హంసిని, లహరి, మాధురి, అనుష్క, నవ్యశ్రీ, రిత్వికశ్రీ, శ్రావ్య, దీపిక ఉన్నారు. బాలుర జట్టులో... మధుకుమార్, వినయ్‌కుమార్, ఇలియాజ్, హేమంత్, యువన్, శివసాయి, జయంత్, మేషక్, ప్రశాంత్, అమర్‌నాథ్, జస్వంత్, ఏకాంత్, తన్విత్‌కుమార్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 16వతేదీ నుంచి పల్నాడు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు.

ఉత్సాహంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు


సందేశమిస్తున్న పాస్టర్ అనిల్ కుమార్, పాల్గొన్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం అరవిందనగర్‌లోని జీసస్ కంపాషన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి వ్యవస్థాపకుడు మోజస్ అనిల్‌కుమార్ ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. అనంతరం పలువురు కోయర్‌లు భక్తిగీతాలాపనలతో అలరించారు. తదనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే దైవజనులందరికీ ప్రేమవిందును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శమంతకమణి, మాజీ మేయర్ స్వరూప, పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

కనీస వేతనం రూ.300

జిల్లాస్థాయిలో వేజ్ మానిటరింగ్ సెల్

నిరంతర తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ




పనిచేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా బోగస్ మస్టర్లకు చెక్ పెట్టి...ఉపాధి కూలీలకు దినసరి కూలీ పెంచేలా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న రూ.263 నుంచి రూ.300కు పెంచడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. బోగస్ మస్టర్లకు చెక్ పెడుతూనే... కూలీల పనివేళల్లో మార్పులు చేసి గిట్టుబాటు వేతనం లభించేలా వేజ్ మానిటరింగ్ విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ విభాగానికి డ్వామాలో కీలకంగా ఉండే జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. కూలీలు ప్రస్తుతం చేస్తున్న 4 గంటల పనిని అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బందితో పాటు ఏపీడీలు, ఏపీఓలు, ఎంపీడీఓలు నిత్యం మస్టర్లను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి చర్యలతో కూలీలకు సగటున రూ.300 వేతనం లభించే వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. దినసరి కూలి రూ.300 పడాలంటే ఏయే పనులు, ఎంత సమయం పనిచేయాల్సి ఉంటుంది అనే అంశాలపై జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వేజ్ మానిటరింగ్ సెల్ పరిశీలిస్తుంది. ప్రస్తుతం దినసరి కూలి సగటున రూ.263 పడుతోంది. దీనిని రూ.300కు పెంచడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు ప్రారంభించాయి.

జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగం

ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేసి అసలైన కూలీలకు ప్రస్తుతం వస్తున్న వేతనం పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగం (వేజ్ మానిటరింగ్ సెల్) ఏర్పాటు చేసింది. ఉపాధి పనుల్లో ఇప్పటికీ బోగస్ మస్టర్ల బాగోతం నడుస్తోంది. కూలీలు పనులకు రాకపోయినా హాజరైనట్లుగా కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. దీంతో వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందడం లేదు. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పర్యవేక్షణ బాధ్యత జిల్లా విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు.

కూలి రూ.300 చెల్లించేలా చర్యలు

జాబ్ కార్డుదారులందరికీ దినసరి కూలి రూ.300 అందేలా చూడడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా ఉపాధి కూలీల పనివేళలు పెంచాల్సి ఉంది. రోజుకు 4గంటలు పనిచేసేకూలీలు 5గంటల పాటు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుంది. ఈ విషయాన్ని ప్రతి కూలీ గుర్తించాలి. కూలీలకు దినసరి వేతనం పెంచడంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రస్తుతం దినసరి కూలి రూ.263 పడుతోంది. ఇందుకు అనుగుణంగా అదనంగా మరో రూ.37 కలిపి మొత్తం రోజుకు రూ.300 పడేలా చర్యలు తీసుకుంటున్నాం. **-సలీంబాషా, పీడీ, డ్వామా**



వేతనం పెంపునకు నిబంధనలు

ఉపాధి కూలీలకు కనీస వేతనం సగటున రూ.300 పెంచేందుకు ప్రభుత్వం పలు నిబంధనలను జారీ చేసింది. ప్రధానంగా పనుల గుర్తింపు, పనిప్రదేశాలకు అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం కూలీలు పని చేయడానికి సానుకూలంగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. టెక్నికల్ అసిస్టెంట్లు నిత్యం మానిటరింగ్ చేయాలి. ఏపీడీ, ఏపీఓ, ఎంపీడీఓలు మస్టర్లను తనిఖీ చేయాలి. కూలీలు చేసే పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. కూలీలకు చెల్లించే వేతనాల రసీదులు కచ్చితంగ ఇవ్వాలి.

విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం ముగిశాయి. గ్రూప్ విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు విజేతగా ఆవిర్భవించింది. నంద్యాల ద్వితీయ, తిరుపతి తృతీయస్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ట్రోఫీలు అందించారు. ఎమెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో జంప్‌రోప్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య, కార్యదర్శి సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి నరసింహులు నాయక్ పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

పేకాటలో పట్టుబడ్డ వైసీపీ సర్పంచ్

ఉరవకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలో పేకాట ఆడుతూ అదే పంచాయతీ వైసీపీ సర్పంచ్ యోగేంద్రరెడ్డి పట్టుబడ్డారు. ఎస్ఐ జనార్దననాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సచివాలయం సమీపంలో పేకాట ఆడుతుండగా 16 మందిని అరెస్ట్‌చేసి, వారి నుంచి 13,700 నగదు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేమని వివరించారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ఇన్‌ఫ్లో 695 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 623 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

సీమ ఉద్యమంలో కవుల పాత్ర కీలకం

మహాకవి సమ్మేళనంలో బొజ్జా దశరథరామిరెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉద్యమ వికాసంలో కవుల పాత్ర కీలకం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహా కవిసమ్మేళనానికి బొజ్జా దశరథరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కవులు తమ కవితాగానం వినిపించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ... అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో కీలకమైన హంద్రీనీవా కాలువల నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ.. సమైక్యాంధ్ర మత్తులో తరతరాలుగా రాయలసీమ మోసపోతూనే ఉందని, సీమ సాహిత్య రంగంలో మరింత చలనం రావాలని కోరారు. సీనియర్ రచయిత శాంతినారాయణ మాట్లాడుతూ.. సీమ జీవితంలోని సంక్లిష్టతలను కవులు, రచయితలు మరింత పదునుగా రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కవి డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డి తన కవితాగానం వినిపించారు.


కవి డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డికి ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతరం 'సద్ద కంకి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక అరుణ్, రత్నం, మానవత అమరనాథరెడ్డి, లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లెల నరసింహమూర్తి, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఏలూరు యంగన్న, నబిరసూల్, సడ్లపల్లి చిదంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం నుంచి పడి కూలీ మృతి


రమేష్ (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దుద్దేకుంట సమీపంలో ఐచర్ వాహనంపై నుంచి కిందపడి రమేష్ (24) అనే కూలీ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శివ తెలిపారు. పత్తికొండ వద్ద గొర్రెల ఎరువు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్న వాహనంలో మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామానికి చెందిన రమేష్, ఇతర కూలీలు ఉన్నారు. దుద్దేకుంట గ్రామ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు ఈశ్వరయ్య, ఆదెమ్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటా కిలో రూ. 10



అనంతపురం రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అలసత్వం

జడ్పీకి రూ.92 కోట్ల బకాయి.. వాటర్ యూజర్ చార్జీల వసూళ్లపై నిర్లక్ష్యం


జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు కోట్ల రూపాయలకు చేరింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మున్సిపాలిటీలు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే సీపీడబ్ల్యూఎస్ (కాంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై) ప్రాజెక్టులకు ప్రతి ఏటా జిల్లా పరిషత్ నుంచి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల నీళ్ల వాడుకున్నందుకు మున్సిపాలిటీల నుంచి జడ్పీకి చెల్లించాల్సిన వాటర్ యూజర్ చార్జీలు సక్రమంగా చెల్లించడం లేదు. వసూలు చేసి జడ్పీకి జమ చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. ఇలా ఏళ్ల తరబడి జరుగుతోంది. ఈ నిర్లక్ష్యం ఇప్పుడు కొండై కూర్చింది. మున్సిపాలిటీ నుంచి వాటర్ యూజర్ చార్జీల కింద రూ. 92 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. అయినా...అదే అలసత్వం కనిస్తోంది.

నిధులు వెళ్లడమే తప్ప.. వచ్చేది లేదు...

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సీపీడబ్ల్యూఎస్ పథకాలు 48 ఉన్నాయి. ఇందులో అనంతపురంలో 33 ఉండగా.. వాటి పరిధిలో 673 గ్రామాలకు, సత్యసాయి జిల్లాలో 15 ఉండగా.. వాటి పరిధిలో 615 గ్రామాలకు నీళ్లు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా శ్రీరామిరెడ్డి, జేసీ నాగిరెడ్డి వంటి మేజర్ ప్రాజెక్టుల ద్వారా గ్రామాలు, మున్సిపాలిటీలకు నీళ్లు అందిస్తున్నారు. ఈ ప్రాజక్టుల నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తారు. ప్రతి ఏటా ఆపరేషన్, నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కోసం జిల్లా పరిషత్ నుంచి కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తారు. ప్రాజెక్టుల నిర్వహణకు జడ్పీ నుంచి నిధులను మాత్రం నీళ్ల ప్రాయంగా తీసుకెళ్తున్నారు. ఆ ప్రాజక్టుల ద్వారా నీళ్లు వాడుకున్నందుకు వాటర్ యూజర్ చార్జీలు చెల్లించడం లేదు. దీంతో ముఖ్యంగా మున్సిపాలిటీల నుంచి కోట్లల్లో బకాయిలు ఉన్నాయి.

రూ. 92.64 కోట్లు పెండింగ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల నుంచి రూ.92.64 కోట్లు జిల్లా పరిషత్‌కు వాటర్ యూజర్ చార్జీలు రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా హిందూపురం మున్సిపాలిటీ నుంచి రూ.38.51 కోట్లు, తాడిపత్రి నుంచి రూ.31.54 కోట్లు, కళ్యాణదుర్గం రూ.15.73 కోట్లు, గుత్తి రూ. 4.47 కోట్లు, మడకశిర నుంచి రూ.2.37 కోట్లు వాటర్ యూజర్ చార్జీలు జడ్పీకి జమ చేయాల్సి ఉంది. కీలక ప్రాజెక్టులకు ఆపరేషన్, నిర్వహణ కోసం జడ్పీ నుంచి నిధులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు తీసుకెళ్తున్నారు. కానీ.. వాటర్ యూజర్ చార్జీలు వసూళ్లు చేసి జడ్పీకి జమ చేయడంలో వారు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు జడ్పీలోని పాలకవర్గ పెద్దలు, అధికారులు సైతం ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఇప్పటి వరకూ పెద్దగా చర్చించలేదు. మున్సిపాలిటీల కమిషనర్లను జడ్పీ అధికారులు పిలిపించి పెండింగ్ బకాయిలపై సమీక్ష చేస్తే...కొంత వరకూ బకాయిలు చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది.

కమిషనర్లతో మాట్లాడతాం



జిల్లా పరిషత్‌కు మున్సిపాలిటీల నుంచి వాటర్ యూజర్ చార్జీలు కోట్ల రూపాయలు జమ కావాల్సి ఉంది. తాడిపత్రి మున్సిపాలిటీ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు జమ అయినట్లు తెలుస్తోంది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూజర్ చార్జీల వసూళ్లకు పాలకవర్గంతో చర్చించి, దగ్గర్లోనే అన్ని మున్సిపాలిటీల కమిషనర్లకు లెటర్లు పంపుతాం. వారితో కూడా మాట్లాడి పెండింగ్ బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. -వెంకట సుబ్బయ్య, ఇన్‌చార్జ్ సీఈఓ, జిల్లాపరిషత్

చిత్రావతి కబ్జా..!

- ప్రమాదంలో పుట్టపర్తి..
- పరీవాహక ప్రాంతం ఆక్రమణ
- 50 ఎకరాలకుపైగా అన్యాక్రాంతం
- ఏకంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- పొంచి ఉన్న ముంపు ముప్పు
- గతం నుంచి నేర్చుకోని గుణపాఠం



చిత్రావతి నది చుట్టూ నిర్మించిన భవనాలు

పుట్టపర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చిత్రావతి నది విస్తారంగా ఉండి నిండుగా ప్రవహించేది. ఇటీవల నది చుట్టూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో నది కాస్తా చిన్నబోయింది. కుగ్రామమైన పుట్టపర్తి.. సత్యసాయి అవతరణ, ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. దీంతో జిల్లా, రాష్ట్రం, దేశం నుంచే కాకుండా వీదేశీ భక్తులూ నిత్యం పుట్టపర్తికి వచ్చేవారు. వీరి రాకపోకలు పెరగడంతో స్థానికంగా నివసించే వారిసంఖ్య ఎక్కువైంది. దీంతో కొంతమంది రియల్టర్లు నదిపోరంబోకు ఆక్రమించి.. చిన్నచిన్న భవనాలు నిర్మించుకుని వాటిని సైతం అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. మరికొంత మంది నది పరివాహక ప్రాంతంలో ఏకంగా అపార్ట్‌మెంట్‌లే నిర్మించారు.

● కొందరి స్వార్థం - అందరికి ముప్పు

వ్యాపారులు, రియల్టర్లు, బిల్డర్ల స్వార్థం... అందరికీ శాపంగా మారింది. చిత్రావతి నీరు నదిలో వెళ్లకుండా ఎక్కడికక్కడ నదిని పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో వరదలు వచ్చినప్పుడు నదిలో వెళ్లాల్సిన వరద నీరు పట్టణాన్ని ముంచేస్తుంది. నాలుగేళ్ల క్రితం వరద నీటితో పుట్టపర్తిలో సాయినగర్‌తో పాటు పాతూరు జలమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీంతో వందల కుటుంబాలు కట్టుబట్టలతో వీధినపడ్డారు. పట్టణ పురవీధులు.. కాలువలను తలపించేలా నీరు పారింది.





పురవీధుల్లో పారుతున్న వరదనీరు, పుట్టపర్తిలోని ఆంజనేయస్వామి ఆలయంలో చేరిన వరద నీరు (ఫైల్)

● మారని వైనం

మొదటి సారి 1975లో చిత్రావతినదికి భారీ ఎత్తున వరదనీరు చేరింది. దీంతో ప్రశాంతి నిలయం గోపురం వద్దకు వరదనీరు చేరి పుట్టపర్తి అంతా మునిగిపోయింది. అప్పట్లో భారీ భవనాలు, బిల్డింగ్‌లు లేవు. ఆ తరువాత పట్టణం భారీగా విస్తరించడమేకాక చిత్రావతి నదీ పరివాహక ప్రాంతం సైతం కబ్జాకు గురైంది. 2021 నవంబరులో కూడా చిత్రావతికి భారీ వరద వచ్చింది. నదిలో నీరు వెళ్లడానికి అక్రమ నిర్మాణాలు అడ్డుగా ఉండటంతో ఆ నీరంతా పుట్టపర్తిలోకి చేరింది. దీంతో గృహాలన్నీ మునిగిపోయి రూ. కోట్ల వరకు నష్టం జరిగింది. ఇలా వరదలు వచ్చి పట్టణాన్ని ముంచెత్తినా... స్థానికుల్లో ఏ మాత్రం మార్పురాలేదు. నేటికీ చిత్రావతి పరివాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు.

● 50 ఎకరాలకుపైగా కబ్జా

పుట్టపర్తి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 276, ఎనుములపల్లి సర్వేనెంబరు 344లో చిత్రావతి పోరంబోకు 100 ఎకరాలకుపైగా ఉంది. పుట్టపర్తి పరిసరాల్లో నదికి పడమటి వైపున దాదాపు 30 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్టు సమాచారం. తూర్పువైపున సైతం భవనాలు, చిన్నపాటి నివాస గృహాలు వెలిశాయి. చిత్రావతి దిగువ ప్రాంతంలో బుక్కపట్నం చెరువుకు నీరు వెళ్లే నది ప్రాంతాన్ని పూడ్చివేయడంతో వరద నీరు ఎక్కువైనప్పుడు చెరువులోకి వెళ్లలేక వరదనీరు పట్టణంలోకి వస్తోంది. తద్వారా ముంపునకు గురవుతోంది.

● మొద్దునిద్రలో ఇరిగేషన్

చిత్రావతినది పరీవాహక ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు ఉన్నాయి. అయినా కళ్లెదుటే అక్రమంగా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నీటి పారుదలశాఖ అధికారులు మొద్దు నిద్రే ఇందుకు కారణం. అధికారులు చూజీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కబ్జాదారులు యథేచ్ఛగా స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆది నుంచి నీటిపారుదల శాఖ అధికారులు కఠినంగా.. చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే నది పరీవాహన ప్రాంతం కబ్జాకు గురి అయ్యేదికాదు. నేడు పుట్టపర్తికి ముంపు ప్రమాదం పొంచి ఉండేది కాదు.

న్యూస్ బాక్స్...

ప్రతి ఎకరాకూ సాగునీరు అందాలి



ఎమ్మెల్యే, మాజీమంత్రిని సన్మానిస్తున్న పాలకవర్గాలు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతుల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 15 సాగునీటి సంఘాల పాలకవర్గసభ్యులకు నిర్వహించిన అభినందన సభలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రైతులకు ఏడాదికి 20వేల పెట్టుబడి సాయాన్ని 2025 ఏప్రిల్‌లో అందచేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సాగునీటిసంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరక్టర్లు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని చారుపల్లి మాధవరాయుని చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు బడా మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ముక్తాపురం క్రిష్టప్పను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సన్మానించారు. ఆదివారం స్థానిక బీసీ హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్వీనర్ మైలే శివశంకర్, ఉత్తమరెడ్డి, సలాంఖాన్, రాజారెడ్డి పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు అన్యాయం చేయొద్దు

కదిరి అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణుల కుల వృతిని దెబ్బతీయడానికి కొన్ని కార్పొరేటు శక్తులు ప్రయత్నిస్తున్నాయని, తమకు అన్యాయం చేయవద్దని నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లా ఆవరణంలో నిర్వహించిన సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కులవృత్తే జీవనాధారంగా బతుకుతున్న నాయి బ్రాహ్మణుల ఉపాధికి కార్పొరేట్ సెల్యూన్‌లు దెబ్బకొందు తున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని పట్టణాల్లో కార్పొరేట్ సెల్యూన్స్ ప్రారంభమయ్యాయన్నారు. కదిరిలో కూడా అలాంటి ప్రయత్నం జరుగుతోందన్నారు. దీంతో నాయీబ్రాహ్మణులు సతమతమవు తున్నారన్నారు. భారీ ఎత్తున కార్పొరేట్ సెల్యూన్లు వస్తే వారి వద్ద కూలీలుగా నాయీబ్రాహ్మణులు చేరడం తప్ప మరో దిక్కులేదన్నారు. ఫ్రాంచ్‌సైజీ ముసుగులో సెల్యూన్ షాపులు పెట్టడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మోహన్‌గాంధీ, ఆ సంఘం నాయకులు హరిప్రసాద్, మునికుమార్, క్రిష్ణ, అనిమల ప్రసాద్, శ్రీనివాసులు, రమణ, లోకేష్, శివ పాల్గొన్నారు.



సమావేశమైన నాయీబ్రాహ్మణులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, సీఐటీయూ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. సీపీఎం కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్‌కు ఆ నాయకులు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి మారుతి మాట్లాడుతూ... విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్‌మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు.. నేడు ఆ హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఇందులో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్లు అయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున,చేనేత నాయకులు హరి, వెంకటస్వామి, రవి, చిన్నరాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

చర్చికి మైక్ సెట్ వితరణ



మైక్ సెంట్ అందచేస్తున్న దృశ్యం

తనకల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పారిశ్రామిక వేత్త ఎంజీరెడ్డి దేవళం తండాలోని విశ్వవాణీ చర్చికి రూ.35 వేలు విలువచేసే మైక్ సెంటర్‌ను అందించారు. ఆదివారం ఆ మైక్ సెంట్‌ను తన అనుచరుల ద్వారా చర్చికి అందించారు. కార్యక్రమంలో చర్చిఫాదర్ కళ్యాణ్‌కుమార్, ఎంజీరెడ్డి అనుచరులు సమరసింహారెడ్డి, వినోద్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భాగవత ప్రవచనాలు

ధర్మవరంరూరల్: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఇస్కాన్ మందిరంలో ఆదివారం ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ శ్రీభాగవత ప్రవచనాలపై భక్తులకు వివరించారు. మందిరంలో కొలువుదీరిన జగన్నాథ్, బలరామ, సుభద్ర స్వామివారి ప్రతిమలను విశేషంగా అలంకరణ చేసి హరినామసంకీర్తనలు చేశారు.

సహనంతోనే ప్రశాంతత

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జీవితం చాలా విలువైందని, సహనంతోనే ప్రశాంత జీవితం సాధ్యమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం భగవాన్ భాయి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సబ్‌జైలులో ఆయన ఖైదీలలో సహనం, ఓర్పు, ప్రవర్తన తదితర అంశాలపై మాట్లాడారు. ప్రతీకారం తీర్చుకునే బదులు తమను తాము మార్చుకునే దోరణి కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ సహనంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మంరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, టీకే శ్రీనివాసులు, సుధాకర్‌భాయ్, క్రాంతిభాయ్, రాజుభాయ్ పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న భగవాన్ భాయి



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ధర్మవరం పట్టణంలోని 32వ వార్డులో వైసీపీ నాయకుడు తలారి రమేశ్, ఆయన అనుచరులు 50 కుటుంబాలు, మండలంలోని చింతలపల్లి పంచాయతీకి చెందిన వైసీపీకి 60 కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. వీరు అనంతపురంలోని పరిటాల క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... గతంలో వైసీపీ నాయకుల భయంతో అయిష్టంగానే చాలా మంది ఆ పార్టీలో ఉన్నారని, ఇప్పుడు టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ధర్మవరంలో వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, టీడీపీనాయకుడు ఫణికుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీమతి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాలలో 19883-84 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 56 మంది విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఆదివారం స్థానిక ఆర్వేజె కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఆ విద్యార్థులు నాటి గురువులను ఘనంగా సన్మానించారు. నాటి విద్యార్థులు ప్రస్తుత శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, పుడా మాజీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, బిల్డర్ మల్లికార్జున, వెంకటేసు, సాయిప్రసాద్, కోనంకి చంద్రశేఖర్, ఏఎస్ఐ నాగభూషణ్, కావేటి వెంకట పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాటి విద్యార్థులు ఆర్జే రత్నాకర్, తదితరులు

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం శ్రీవారి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు దాతలు గొర్తి సుధాకర్‌నాయుడు, గొర్తి భారతి సౌరధ్యంలో వైభవంగా జరిగాయి. ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. ఈ వేడుకల్లో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అదేవిధంగా గొర్తి భారతి, గొర్తిసుధాకర్ నాయుడు కుమారుడు హర్షవర్ధన్‌చౌదరి జన్మదినాన్ని పురష్కరించుకుని ఆలయ ఆవరణంలో కేక్ కట్ చేశారు.



చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రేగాటిపల్లి రోడ్డు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దయ్యగుట్టకు చెందిన విశ్వనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతను ఆదివారం తన కుమార్తె జ్యోతితో కలిసి.. బైక్‌పై ధర్మవరం నుంచి రేగాటిపల్లికి వెళ్తుండగా భైరవగుడి వద్ద ఓ కారు ఢీకొంది. ప్రమాదంలో విశ్వనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. జ్యోతికి ఎలాంటి గాయాలూ కాలేదు. విశ్వనాథ్‌ను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి





హోమం నిర్వహిస్తున్న అర్చకులు, అలంకరణలో దత్తాత్రేయ (ఇన్‌సెట్లో)

ధర్మవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు షిర్డీ సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ జయంతి వేడుకల్లో భాగంగా అభిషేకాలు, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, నారాయణరెడ్డి, రామలింగయ్య, జేసీ నాయుడు, జలదంకి సూర్యనారాయణ, సూర్యప్రకాశ్, రాంప్రసాద్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్పీ

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు 73 వర్ధంతిని పురష్కరించుకొని ఆదివారం జిల్లాపోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ వీరత్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

ధర్మవరంరూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజక వర్గంలోని అన్ని చెరువులకు నీరు తీసుకొచ్చి.. రైతు సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘం సభ్యులు ఆదివారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో పరిటాలశ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి పార్టీలకు చెందిన సానుభూతిపరులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు. వారు కూడా పరిటాలశ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేష్‌చౌదరి, ధర్మవరం టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, గొట్లూరుశ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి విజయ్‌సారథి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు ఏగినాటి వెంకటరమణ, మహిళ మండలఅధ్యక్షురాలు తలారి వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న రత్నాకర్


వైభవంగా సామూహిక వివాహాలు

కొత్తచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీలక్ష్మీచెన్న కేశవపురంలో ఉచిత వివాహాలను బిల్డర్ చల్లాసాయికృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు ఏటా ఇలా ఉచిత వివాహాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 22 జంటలు ఏకమయ్యాయి. నిర్వాహకులు లండన్‌కు చెందిన అనిల్‌పటేల్ జంటలకు మంగళసూత్రం, పట్టువస్త్రాలను గృహోపకారానికి ఉపయోగపడే వస్తువులను అందజేశారు. ఈ వేడుకలకు సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్, ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ధర్మవరంరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతులనాగేపల్లి, సీసీకొత్తకోట, నిమ్మలకుంట గ్రామాల్లో ప్రబోధసేవాసమితి ఇందూజ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. మార్గశిర పౌర్ణమిని పురష్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇందులో ఆ వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణాచారి, సమితి సభ్యులు భాస్కర్, సాధు, శివమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, సునీత, శారద, గంగాదేవి, చౌడేశ్వరి, త్రైతేశ్వరి, చంద్రశేఖర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు కాలకూట విషం



- ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ షాపులు
- బ్యాచ్ నంబర్లు మార్చి విక్రయిస్తున్నవైనం
- వైద్యుల సూచన లేకుండా అమ్మకాలు
- అధికారుల పర్యవేక్షణ అంతంతే..



హిందూపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల లేపాక్షి మండలానికి చెందిన ఓ మహిళ పట్టణంలోని మెడికల్ షాపువద్దకు వెళ్లింది. అక్కడ ఆమె జ్వరం, జలుబు, తలనొప్పికోసం మందులు కొనుగోలుచేసింది. ఆమె వాటిని తీసుకెళ్లి రెండ్రోజులపాటు వాడింది. అయినా నయం కాలేదు. మందులు తీసుకెళ్లిన మహిళ చదువు అంతంతే. రూ.300పెట్టి కొనుగోలు మందులు మింగినా నయం కాలేదని పక్కింట్లో చదువుకున్న యువతికి చూపించింది. ఆ మందులకు మూడు నెలల క్రితమే కాలం చెల్లిందని చెప్పింది. దీంతో ఆ మహిళ కొనుగోలుచేసిన మెడికల్ షాపువద్దకు వెళ్లి మీరు కాలం చెల్లిన మందులు ఇచ్చారేమిటని ప్రశ్నించింది. ఆ మెడికల్ షాపు నిర్వాహకులు ఇవి మా షాపులో ఇవి కొనుగోలుచేసినవికాదని పంపించేశారు. అలాంటిదే మరో ఘటన 15రోజుల క్రితం హిందూపురం మండలం కొటిపిప్రాంతానికి చెందిన వ్యక్తికి ఎదురైంది. ఆ వ్యక్తి పట్టణంలోని ఓ వైద్యుని సూచనలమేరకు పెనుకొండ రోడ్డులో ఉన్న ఓ మందుల దుకాణంలో కొన్ని మందులను కొనుగోలు చేశాడు. అవి తీసుకెళ్లి రెండు పూటలు వేసుకున్నాక వాంతులు ప్రారంభమయ్యాయి. వాటిని పరిశీలిస్తే కాలం చెల్లిందన్న విషయం తేలింది. ఈ విషయం బంధువులకు చెప్పడంతో వారు మెడికల్ షాపుకు వెళ్లి ప్రశ్నించారు. నిర్వాహకులు వారిపైనే తిరగబడేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంలో మరికొంతమంది వారికి తోడుగా వచ్చి ప్రశ్నించడంతో చేసేదిలేక ఆసుపత్రి ఖర్చులు భరించారు. ఇవి మచ్చుకు మాత్రమే ఇలాంటివి పట్టణంలోని కొన్ని మందుల షాపుల్లో చాలా తరచుగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. వీటిపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ బాధ్యతను గాలికి వదిలేశారని విమర్శిస్తున్నారు.

ఎవరైనా అనారోగ్యం బారినపడితే వారి ప్రాణం కాపాడాలంటే మందులే కీలకం. మహమ్మారి కరోనా అనంతరం మందుల దుకాణాలకు డిమాండ్ బాగా పెరిగింది. చిన్నా, పెద్దా మందుల దుకాణాలన్నీ కిటకిటలాడుతుంటాయి. అవసరమున్నా లేకున్నా వైద్యులు సూచించిన మందులను కొనుగోలుచేసి ఇంటిలోనే ఉంచుకుంటున్నారు. వాటిలో కొన్ని కాలంచెల్లిన మందులు కూడా ఉండటం భయాందోళనకు గురిచేస్తోంది. రోగికి ఏదైనా ఇబ్బంది ఎదురైతే తానుఇవ్వలేదంటూ తప్పించుకున్న పరిస్థితులు కోకొల్లలు. జిల్లాలో ఇలాంటి ఘటనలు చాలా జరుగుతున్నాయి. కాలం చెల్లిన మందులు వేసుకోవడంతో వాంతులు, విరేచనాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయాలు

ఇటీవల కొన్ని మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులను (ఎక్స్‌పైరీడేట్ ముగిసినా) విక్రయిస్తున్నారు. వైద్యులు సూచించినప్పుడు మాత్రం ఇవ్వరు. సొంతంగా ఎవరైనా వెళ్లి మందులు అడిగితే అప్పుడు అలాంటివారికి కాలం ఇటువంటి మందులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో ఇలాంటి తంతు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మండలకేంద్రాల్లో ఉన్న షాపుల్లో అయితే ఇష్టానుసారంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 2వేల దాకా మెడికల్ షాపులున్నట్లు సమాచారం. అంతేకాక బ్యాచ్‌నంబర్లు మార్చి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

వైద్యుల సూచనలు లేకుండా

కొన్ని హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో వైద్యుల సూచనలు లేకున్నా మందులు ఇచ్చేస్తున్నారు. మందులకు సంబంధించి బ్యాచ్ నంబర్లు ఉంటాయి. వాటిని మార్చి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో కాలం చెల్లిన మందులు అమ్మడంలో కొంతమంది మెడికల్ షాపు సిబ్బంది పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరిలో కొంతమంది అధికారులతో సత్సంబంధాలుపెట్టుకుని ఈ తంతు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కొరవడిన పర్యవేక్షణ

కాలం చెల్లిన మందులు విక్రయించినా, బ్యాచ్ నంబర్లు మార్చేసి అమ్మేసినా, ఎమ్మార్పీకంటే ధరలు అధికంగా వసూలుచేసినా సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 2వేల ఔషధ దుకాణాలున్నా అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తేతప్ప తనిఖీలు చేయరు.

దీనిపై డ్రగ్ ఇన్‌చార్జి అధికారి ఏడీ రమేష్‌రెడ్డిని వివరణకోసం ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- సాగునీటి సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందరూ సిద్ధంగా ఉండాలని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పట్ల వైసీపీ అధినేత జగన్‌కు నమ్మకం లేదని, ఆయన ప్రస్తుతం అధికారంలో ఉంటే రాజ్యాంగం పట్ల గౌరవం లేక ఎన్నికలలో ఏకపక్షంగా అంతా తామే ఉండాలంటూ గ్రామస్థాయిలో దౌర్జన్యాలకు దిగేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్న వ్యక్తి అని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఆయన ఎల్లవేళలా కృషి చేస్తారన్నారు. నియోజకవర్గంలో కూటమి పార్టీ జెండాలు మినహా ప్రతిపక్ష పార్టీ జెండాలు కనిపించరాదంటే పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీకి ద్రోహం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాలనలో మరింత శక్తిని ఇవ్వాలంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేర్చగలిగితే మరింత ఓటు బ్యాంకు పెరుగుతుందన్నారు. సాగునీటి సంఘాల్లో ఎన్నికైన అధ్యక్ష ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలుపుతూ క్షేత్రస్థాయిలో ఆయకట్టు అభివృద్ధికి, చెరువుల మరమ్మతుకు, ఆయకట్టు పరిధిలోని రైతుల అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, గణేష్, దాసిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వందలాది కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన గ్రామస్థులతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డేరి గ్రామంలో వందలాది కుటుంబాలు కాంగ్రెస్, వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వారిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. రొళ్ల మండలం దొడ్డేరి గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈగ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు మంచి నిర్ణయం తీసుకొన్నారని, ఏనమ్మకంతో పార్టీలో చేరారో అదే నమ్మకంతో పనిచేస్తామని తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రత్నగిరి రిజర్వాయర్ నిర్మాణం గురించి వివరించారు. రంగనపల్లి సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు మా కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, దొడ్డేరి మాజీ జడ్పీటీసీ పాండురంగప్ప, దొడ్డేరి సీనియర్ నాయకులు నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా! నమో భక్తవరదా!



భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడ గుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి బ్రహ్మ రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవానికి ముందు గుమ్మడికాయ కొడుతున్న ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి



బ్రహ్మోత్సవాల్లో బందోబస్తుకు పోలీసులను అప్రమత్తం చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు. బ్రహ్మోత్సవాలకు ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 230 మంది పోలీసు కానిస్టేబుళ్లను బందోబస్తుకు కేటాయించినట్లు డీఎస్పీ తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గోపీనాథ్

పెనుకొండ రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని జిప్సీ హాస్టల్‌లోని 50 మంది విద్యార్థులకు త్రిపుర రిసార్ట్ యజమాని, బీజేపీ సభ్యత్వ నమోదు బాధ్యుడు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి అనంత జిల్లా బైక్ రైడర్స్ అసోషియేషన్ సహకారంతో చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. వీలైనంత వరకు విద్యార్థుల చదువుకోసం సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భీమ్లానాయక్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్

హిందూపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో చేపట్టిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి డాక్టర్ శ్రీవాణి ప్రసాద్ విరాళం అందించారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రఘు, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, రాము, రఘు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రేపు భవన నిర్మాణ కార్మికుల సమావేశం

గోరంట్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ కూరగాయాల మార్కెట్‌లో మంగళవారం భవననిర్మాణ కార్మికుల ఆత్మీయసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య తెలిపారు. ఈ సమావేశంలో గత ఐదేళ్లలో ప్రభుత్వంనుంచి అందాల్సిన సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న పరిహారం తదితరాంశాలపై చర్చిస్తామన్నారు. భవన నిర్మాణఅన్నివిభాగాల కార్మికులు హాజరుకావాలన్నారు. ఈకార్యక్రమంలో ముద్దల వెంకటరాముడు, బాషా, చంద్రశేఖర్ తదితరులున్నారు.

హెల్మెట్ ధారణపై కౌన్సెలింగ్



హెల్మెట్‌తో కలిగే లాభాలను వివరిస్తున్న ఎస్ఐ మునీర్ అహమ్మద్

చిలమత్తూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చిలమత్తూరు ఎస్ఐ మునీర్ అహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం ఈ మేరకు యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు గాయాలు కాకుండా కాపాడుతుందని తెలిసినా పట్టించుకోవడం లేదని బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతున్నారని, అందుకు కారణం వాహనం నడిపే సమయంలో వారు హెల్మెట్ ధరించకపోవడమే కారణమన్నారు. ప్రమాదంలో కాలు, చెయ్యి వంటి అవయవాలకు దెబ్బలు తగిలినా ప్రాణాపాయం ఉండదని, కానీ తలకు తగిలితే ప్రాణాలతో బయటపడటం కష్టమన్నారు. అందుకే హెల్మెట్ ధరిస్తే తలకు ఎంతో రక్షణగా ఉంటుందన్నారు. దాంతో ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని పదే పదే హెచ్చరించారు. వాహనదారుల వద్ద లైసెన్స్, ఆర్‌సీ ఉండాలని. లైసెన్స్ లేకుండా నడిపితే శిక్ష పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా..

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని కొడిగనల హల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం డ్రగ్స్ నిర్మూలనపై భగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిధిగా హాజరైన ఎస్ఐ రంగడుయాదవ్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలవుతూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవడం తగదన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బాగా చదువుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. డ్రగ్స్ ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షుడు కార్తీక్, సభ్యులు, ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం కోసం సీఎం వద్దకు వెళ్తాం

పెనుకొండ టౌన్, డిసెంబరు15(ఆంధ్ర జ్యోతి): రొద్దం మండలం కొత్తూరు గ్రామంలో పద్మనాభ వారసుల నుంచి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిని వెంటనే రద్దు చేసుకోవాలని లేకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని వడ్డెర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వడ్డెర్ల నివాసంలో ఆయన మాట్లాడారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల బెదిరింపులకు భయపడమని పూర్తి ఆధారాలతో సీయం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్రాభిషేకం



పూజలందుకుంటున్న శివపార్వతులు

రొళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రొళ్ల పరిధిలోని రొళ్ల కొండ దగ్గర ఉమ మహేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వేకువజామున ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈశ్వరుడికి ఆరుద్రాభిషేకం చేశారు. ఈసందర్భంగా సుప్రభాత సేవ, రుద్ర నమక చమకాలతో ఈశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు మోహన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

నేటికీ మార్పు రాలేదు



రైతు సేవా కేంద్రం భవనంపై మాజీ సీఎం బొమ్మ

మడకశిర రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచినా నేటికి కొన్ని శాఖల్లో మార్పురాలేదు. పాత పద్దతులనే కొనసాగిస్తున్నారు. మండలంలోని మణూరు గ్రామంలో రైతు సేవా కేంద్రంపై నేటికి మాజీ సీఎం బొమ్మ దర్శనమిస్తోంది. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు సేవాకేంద్రాలుగా మార్పుచేశారు. సంబంధిత అధికారులు వాటిని మార్చకపోవడంతో ప్రజల నుంచి పలువిమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభ చాటిన పురం విద్యార్థులు



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

హిందూపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో హిందూపురం యునైటెడ్ జట్టు ప్రతిభ చాటింది. ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో హిందూపురం, గుంతకల్లు జట్లు తలపడ్డాయి. ఇందులో పురం జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ధర్మవరం 2-0 గోల్స్, మూడో మ్యాచ్‌లో ధర్మవరంపై గుంతకల్లు 7-4 గోల్స్, పురం 7-0తో చాపిడిపై గెలుపొందాయి. ఆయా జట్లను నిర్వాహకులు అభినందించారు.

ఘనంగా నాగుల విగ్రహ ప్రతిష్ఠ



నాగదేవతా విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యం

గుడిబండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరగల్లు గ్రామంలో ఆదివారం నాగుల విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ హోమ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచి జయమ్మ, వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఈరలక్కప్ప, ఎంపీటీసీ పుష్పలత, మండలపల్లి సర్పంచు అశ్వత్, గ్రామస్తులు హనుమంతరాయప్ప, నాగప్ప, బాదిపల్లెప్ప, లక్ష్మీనారాయణ, దళవాయి జల్లెప్ప, విగ్రహ దాత రాజబాబు, లక్ష్మీనరసప్ప, చిక్కయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

హిందూపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఆర్యవైశ్యులు చిన్నమార్కెట్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించాడన్నారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులతో పాటు వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు దాస సందేష్, పాంచజన్య శ్రీనివాసులు, హరి, సుబ్రహ్మణ్యం, దాస గంగాధర్ పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో...

పొట్టి శ్రీరాములు వర్ధంతిని వైసీపీ ఇన్‌చార్జి దీపిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దీపిక మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శివ, మహేష్, నాగేంద్ర, గిరి, రామకృష్ణారెడ్డి, రాము పాల్గొన్నారు.

ప్రముఖులకు ఘననివాళి



గోరంట్లలో ప్రముఖులకు నివాళి అర్పిస్తున్న అధికారులు

గోరంట్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్‌వల్లబాయి పటేల్‌ల వర్థంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రంకోసం ప్రాణాలుఅర్పించిన అమరజీవి గురించి, సర్దార్ వల్లబాయి పటేల్ గురించి కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీపీ ప్రమీల, వైస్ ఎంపీపీ నాగభూషణరెడ్డి, మండలపరిషత్, ఉపాధి, పంచాయతీ, సచివాలయ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

18న సౌరశక్తిపై అవగాహన

గోరంట్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవిమహాల్‌లో ఈనెల 18న సౌరశక్తి వినియోగంపై ప్రజలకు అవగాహనా సమావేశం నిర్వహిస్తామని విద్యుత్ ఎఈ బాలక్రిష్ణనాయక్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశానికి విద్యుత్‌శాఖ సౌరశక్తి విభాగం అధికారులు, బ్యాంక్ సిబ్బంది హాజరవుతారన్నారు. పిఎం సూర్యాఘర్ పథకంద్వారా ఇంటిపైరాయితీ సోలార్ రూఫ్‌టాప్ నిర్మించి, విద్యుత్ బిల్లులు తక్కువగా వచ్చేందుకు మార్గాలను వివరిస్తామన్నారు. ఈసమావేశానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

విషాహారం తిని మహిళకు అస్వస్థత

గోరంట్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డులో నివాసముంటున్న మేఘన పొరపాటున విషం కలిపిన ఆహారం తిని ఆదివారం అస్వస్థతకు గురయింది. మంజునాథ్, మేఘన దంపతులు ఇంటివద్ద పావురాలను పెంచుకుంటున్నారు. కుటుంబ సభ్యులు పావురాలకోసం అన్నంలో క్రిమిసంహారమందును కలిపి ఉంచారు. ఆ విషయం తెలియకపోవడంతో పొరపాటున ఆమె ఆ అన్నం తినడంతో వాంతులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, మెరుగైన వైద్యంకోసం ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.